క్లుప్తంగా

రేపు సుద్దాల అశోక్ తేజకు పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం గ్రూప్‌ల ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ కేవీ.రమణ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు వంశీ వ్యవస్థాపకులు వంశీ రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి, సినీ నటులు ఆర్.నారాయణ మూర్తి, ఉత్తేజ్, తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు కిషన్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'ఈహెచ్‌ఎస్ పథకం పెన్షన్ దారులకు ఆరోగ్య భద్రత'

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారుల కోసం ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్) అమలు చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు శాసనసభలో ప్రకటించడంపై తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మోహన్‌నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షన్‌దారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు, అసెంబ్లీలో ప్రకటన చేసిన మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈహెచ్‌ఎస్‌తో పెన్షన్‌దారులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక శాతం చందాతో నగదు రహిత ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టి ఆరోగ్య భద్రతను ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

దేవర కరుణాకర్‌కు నివాళి



దివంగత దేవర కరుణాకర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ సంస్మరణ సభ మంగళవారం న్యూ సత్యనారాయణనగర్‌లోని మోహిని ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. అమరజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. పదవులతో సంబంధం లేకుండా దివంగత దేవర కరుణాకర్ ఎప్పుడూ ప్రజాసేవలో ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వంశీ, శ్రీకాంత్ సాగర్, కట్ల అశోక్, అశ్విన్, ప్రభు పూజారి, నామా యాదగిరి, బీజేపీ అనుబంధ విభాగాలకు నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

యాకుత్‌పురా: సత్ప్రవర్తన మార్చుకోకుండా నేరాలకు పాల్పడే రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ సూదిరెడ్డి దామోదర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం డబీర్‌పురాలోని ఏసీపీ కార్యాలయంలో పలువురు రౌడీషీటర్లకు ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఇచ్చే సూచనలు పాటించి సత్ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. తిరిగి నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. నేరాలను రూపు మాపేందుకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జోరుగా 'హాత్ సే హాత్ జోడో'



హాత్ సే హాత్ జోడోలో రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని ధూల్‌పేట్, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం జోరుగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఇంటింటా తిరుగుతూ.. కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టిన ప్రగతి, అభివృద్ధిని వివరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్‌దే అధికారమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిజ మోహన్‌సింగ్, సంతోష్ సింగ్, సైని శ్రీనివాస్, ప్రవీణ్, నర్సింగ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో మేకలు గాయబ్

- రోజురోజుకూ పెరుగుతున్న మేకల దొంగతనాలు
- గుట్టుచప్పుడు కాకుండా మేకలను దొంగిలిస్తున్న ముఠా
- పట్టుకోవాలంటున్న మేకల యజమానులు



ఇటీవల చోరీకి గురైన మేకలు (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో కొంత మంది పెంచుకుంటున్న మేకల దొంగతనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా పథకం ప్రకారం ఈ మేకల దొంగతనాలు జరుగుతున్నట్లు స్థానికులు అంటున్నారు. ఎంతో కష్టపడి మేకలను పెంచుకుంటున్న యజమానుల కన్నుగప్పి దొంగల ముఠా తిరుగుతూ మేకలను తస్కరిస్తున్నారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లే మేకలు ఆయా బస్తీల పరిసరాలు, గల్లీల్లో సాయంత్రం వరకు తిరిగి ఆయా ఇళ్లకు చేరుకుంటాయి. వీటిపై నిఘా పెడుతున్న దొంగల ముఠా గుట్టు చప్పుడు కాకుండా ఆయా మేకలను దొంగలించి పారిపోతున్నారు.

- గత నెల 27న అమన్‌నగర్‌-ఏ ప్రాంతానికి చెందిన సజ్జాద్ అనే మేకల యజమానికి చెందిన తల్లి మేకతో పాటు మూడు పిల్ల మేకలను దొంగలు తస్కరించి పారిపోయారు. అదేరోజు అర్ధరాత్రి వరకు మేకల కోసం వెతికినా సజ్జాద్ సంబంధిత రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు చెందిన మేకలు తమ బస్తీలో తిరుగుతున్నట్లు బస్తీలోని ఓ మెడికల్ షాపు వద్ద అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు సంబంధిత రెయిన్‌బజార్ పోలీసులకు సమాచారం అందజేశాడు. ఈ మేకల దొంగతనాలు గత రెండు, మూడేళ్లుగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్నట్లు సమాచారం.
- రెండేళ్ల క్రితం మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైతం మేకల దొంగతనాలు జరిగాయని వాటి యజమానులు వెతుక్కుంటూ వెళ్లి పరిశీలించగా.. ఎర్రగడ్డం పశువుల సంతలో ప్రత్యక్షమైనట్లు బాధితులు చెప్పారు. ఎర్రగడ్డ పశువుల సంతలో విక్రయానికి ఉంచిన మేకలు తమవేనంటూ బాధితులు అప్పట్లో మీర్‌చౌక్ పోలీసుటీలకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. పాతబస్తీలో జరుగుతున్న మేకల దొంగతనాలను వెంటనే అరికట్టాలని మేకల పెంపకందారులు కోరుతున్నారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, విక్రమ్ కుమార్

అబిడ్స్: 16న సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కార్యదర్శి విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో వెయ్యి మంది రక్తదానం చేస్తారని మంత్రి కేటీఆర్‌కు వారు వివరించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఉద్యోగులకు అండగా ఉంటూ వారికి చేస్తున్న సేవలు అమోఘమన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు ఆయన నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తుండడం ప్రశంసనీయమన్నారు. అదేవిధంగా మెగా హెల్త్ శిబిరానికి మంత్రి కేటీఆర్ కుటుంబ సమేతంగా రావాలని మంత్రికి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ విక్రమ్‌కుమార్‌లు విజ్ఞప్తి చేశారు.

దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీకి ఆదరణ



నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను సత్కరిస్తున్న కిశోర్ సింగ్, పప్పుమాత్రే, రమేష్ సింగ్

అబిడ్స్: రాష్ట్ర తరహాలోనే దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు పెద్ద ఎత్తున ప్రజాదారణ లభిస్తుందని రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఆదిశక్తి ఫౌండేషన్ సౌత్‌ఇండియా డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కిశోర్‌సింగ్ రాజ్‌పురోహిత్, రమేష్ సింగ్ రాజ్‌పురోహిత్, పప్పుమాత్రేలు ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎలా అధికారంలో వచ్చారో దేశంలో కూడా అధికారంలోకి వస్తారన్నారు. ఉత్తర భారతీయులందరూ బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అన్నివర్గాల ప్రజలు, పలు పార్టీల నాయకులు సీఎం కేసీఆర్ అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలను ఆకర్షించి బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆదిశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు మరింత సేవలందిస్తామని నందకిశోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు.

ముగిసిన హరికథా మహోత్సవాలు



డాక్టర్ కేవీ రమణాచారిని సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి నిరాడంబరుడని పలువురు ప్రముఖులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న హరికథ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు మాట్లాడుతూ.. కేవీ రమణాచారి ఎందరికో ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు కేవీ.రమణాచారి దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు లక్ష్మీమహేష్ నిర్వహణలో శ్రీనివాస కల్యాణం అనే అంశంపై హరికథగానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అశ్విని గ్రూప్ చైర్మన్ అశ్విని సుబ్బారావు, శ్రీ డెవలపర్ ఎండీ భోగరాజు మూర్తి, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్ బజార్ డీఎం అండ్ హెచ్‌ఎస్ క్యాంపస్‌లోని సెయింట్ జాన్ అంబులెన్స్ సర్వీసెస్ 2023 డైరీ, కేలండర్‌ని ఆవిష్కరిస్తున్న వైద్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస రావు. చిత్రంలో సెయింట్ జాన్ అంబులెన్స్ సర్వీసెస్ కార్యదర్శి డాక్టర్ విద్యుత్ కుమార్, చైర్మన్ ఠాకూర్ విజయ్ ప్రసాద్.

- సాక్షి, సిటీబ్యూరో

సంత్ రవిదాస్ జయంతి



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ దర్శన్, అధ్యక్షుడు కిషన్‌ధామా

జియాగూడ: సంత్ రవిదాస్ మహారాజ్ సంఘ సంస్కర్తగా, ఆధ్యాత్మిక వేత్తగా కొన్ని వేల కీర్తనలు రచించి ఆలపించారని కార్పొరేటర్ దర్శన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సంజయ్‌నగర్‌లో శ్రీ హరళయ్య సముగర్ సమాజ్ అధ్యక్షుడు కిషన్ ధామా ఆధ్వర్యంలో ఏర్పాటైన సంత్ రవిదాస్ జయంతి వేడుకలకు ఆయన హాజరై పూజలు నిర్వహించారు. అంతకు ముందు సమాజ్ యువకులు తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 46 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బాప్‌రావు, ఉపాధ్యక్షులు విఠల్‌రావు, రాంచందర్, ప్రధాన కార్యదర్శి సంజయ్ కాంబ్లే, కోశాధికారి రితేష్‌దామ, సహకార్యదర్శి బానుదాస్ కాంబ్లే, రవి, ఎస్.మోహన్, రాజ్‌కుమార్, సలహాదారులు మోహన్‌దామా, మహేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభినందనలు



మహ్మద్ బిలాల్‌ను అభినందిస్తున్న కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2022లో బాక్సింగ్ ఫ్లై వెయిట్ విభాగంలో హబీబ్ ముస్తాఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన మహ్మద్ బిలాల్ కాంస్య పతకాన్ని సాధించడంతో సయ్యద్ హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తాఫా ప్రత్యేకంగా అభినందించారు. మహ్మద్ బిలాల్ కోచ్ హబీబ్ ముస్తాఫా ఆధ్వర్యంలో తన బాక్సింగ్ అకాడమీలో శిక్షణ పొందినట్లు తెలిపారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ డీసీహెచ్‌ఎఫ్ డాక్టర్ సునీత తదితరులు

గోల్కొండ: కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్సతో నయం చేయవచ్చని హైదరాబాద్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సునీతా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. పొగాకు, పొగాకు ఉత్పత్తులు తదితర వాటికి దూరంగా ఉంచాలని, అదే విధంగా మద్యాన్ని కూడా దూరంగా ఉంచితే కేన్సర్ సోకకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా, డాక్టర్ ఖాజా మహ్మద్ రవుఫ్ ఉద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మ సత్యనారాయణకు పురస్కారం



తుమ్మ సత్యనారాయణకు పురస్కారం అందజేస్తున్న అమృత్‌కుమార్ జైన్, సూరేపల్లి రవికుమార్

అబిడ్స్: జాటూరి విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని కవి తుమ్మ సత్యనారాయణకు అందజేశారు. సూరేపల్లి రాములమ్మ ఉమెన్స్ వెల్ఫేర్ ట్రస్ట్ తరఫున 2022 సంవత్సరానికి తుమ్మ సత్యనారాయణను ఎంపిక చేశారు. ట్రస్టు సలహాదారులు అమృత్‌కుమార్ జైన్, అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ ఆయనకు స్మారక పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బండారి జైన్, నజనరాజ్ జైన్, వినిత్‌కుమార్, సుధాకర్‌రావు, నరేంద్ర, దేచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



సభలో అభివాదం చేస్తున్న ఎంపీ తిరుమవైవన్, గద్దర్

గన్‌ఫౌండ్రీ: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌కు అన్నివిధాలుగా సహకరిస్తూ ఆయన ఆలోచనలను ఆచరిస్తూ మహిళా లోకానికి అంబేడ్కర్ సతీమణి రమాబాయి స్ఫూర్తిగా నిలిచారని పార్లమెంట్ సభ్యులు తిరుమవైవన్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జాతీయ ఎస్సీ, ఎస్టీల సంఘాల సమాఖ్య, నూతన పార్లమెంట్ భవన నామకరణ కమిటీల ఆధ్వర్యంలో రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పార్లమెంటు భవనానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరు పెట్టడానికి ఎలాంటి అభ్యంతరాలు ఉండరాదన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మాట్లాడుతూ.. రమాబాయి ఒక నిశబ్ద విప్లవమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వర్, కన్వీనర్ మదన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'మచ్చలేని నాయకుడు కరణ్ కుమార్'



కరణ్ కుమార్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు అమర్ సింగ్ తదితరులు

గోల్కొండ: మచ్చలేని నాయకుడు దివంగత కరణ్ కుమార్ కామ్లేకర్ అని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్ సింగ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ దివంగత కరణ్ కుమార్ కామ్లేకర్ సంతాపసభ మంగళవారం కార్వాన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమర్ సింగ్ మాట్లాడుతూ.. దివంగత కరణ్ కుమార్ బీజేపీ కోసం అహర్నిషలు పని చేశారని, పార్టీ ఆశయ సాధనకు ఆయన ఎప్పుడూ ముందుండి ఇతరులకు మార్గదర్శనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సునీల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



గోల్కొండ: కార్వాన్‌లోని దర్గా షా ఏ షర్ఫీ చమన్ 127 ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనను దర్గా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఘాజిబండ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. సంతోష్‌నగర్, అరుంధతి కాలనీ, మిధాని ఎస్‌ఎస్ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఫైర్ స్టేషన్, పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, బడే మియా పెట్రోల్ పంప్, సీబీఎస్, వివి కన్యా పాఠశాల, సాయి గంగా లాడ్జ్, పుత్లీబౌలి, సంజయ్‌నగర్, నందిని హోటల్, పాత బస్టాండ్ లైన్, దర్గా పీటీ, రామ్ మందిర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే 11 కేవీ జాంబాగ్, సీబీఐ క్వార్టర్స్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వసంత్ విహార్, సెంట్రల్ బ్యాంక్, మయూరి హోటల్, మహారాష్ట్ర బ్యాంక్, వీవీ ఫంక్షన్‌హాల్, జాంబాగ్ 4 పోల్ స్ట్రక్చర్, ట్రూప్ బజార్, వైశ్యా బ్యాంక్, సాగర్ ప్లాజా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకిలో షేక్‌పేట్ మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదుద్దేశంతో పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు నేరుగా అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కూడా పేదలకు వైద్య చికిత్సల నిమిత్తం లక్షలాది రూపాయలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి రమణాచారి కృషి



రమణాచారిని కలిసిన జేఏసీ నాయకులు

సుల్తాన్‌బజార్: అర్చక ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ. రమణాచారి ఎంతో కృషి చేస్తున్నారని అర్చక జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు కందూరి కృష్ణమాచార్యులు అన్నారు. ఈ మేరకు కేవీ.రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాన్ని గౌరవిస్తూ దేవాదాయ శాఖలో కమిషనర్‌గా ఉన్నప్పుడు రమణాచారి ఆలయాల్లో ప్రవచనాలు, హరికథ కాలక్షేపం నిర్వహించారని గుర్తుచేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటూ జేఏసీ తరఫున దేవాదాయ శాఖ ప్రతి ఆలయ కార్యనిర్వహణ అధికారులకు సర్క్యులర్ అందేవిధంగా కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా దేవాదాయశాఖ అధికారులను, కార్యనిర్వహణ అధికారులను అర్చక ఉద్యోగుల సంఘాలన్ని ధార్మిక సంస్థ అయిన దేవాదాయశాఖ ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగేలా సహకరించాలని అధికారులను కోరారు. బండారి జగపతి, అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం'



మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మెజార్టీ ప్రజలైన బీసీలు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ యుగేందర్‌గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో 54 శాతం జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి భిక్షం వేసినట్లు రూ.6229 కోట్లు కేటాయించారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత రాజకీయ, ఆర్థిక సామాజిక విద్యారంగాల్లో అందరికంటే ఎక్కువగా నష్టపోయింది బీసీలే అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ ముదిరాజ్, రాజు, యాదయ్య, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రాజశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల విధులను అడ్డుకున్న నిందితుడికి జైలు

చార్మినార్: మొదటి విడత లాక్‌డౌన్ సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులను అడ్డుకొని బెదిరించిన కేసులో నిందితుడికి చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్ సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3,200 జరిమానా విధించారు. వివరాల ప్రకారం.. మొఘల్‌పురాకు చెందిన అఖీలుద్దీన్ (30) మొదటి విడత 2020 కరోనా లాక్‌డౌన్ సమయంలో పంచ్‌మోహల్లా వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులను అడ్డుకొని బెదిరించాడు. దీనిపై హుస్సేనీఆలం పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేశారు. ఈ కేసులో సహాయక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సుధాకర్ ప్రాసెక్యూషన్ తరఫున వాదనను సమర్థవంతంగా వినిపించారు. దీంతో చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్ నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3,200 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

చోరీ కేసులో 9 నెలల జైలు

డబీర్‌పురా: ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన కేసులో నిందితుడికి నాంపల్లిలోని 8వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కవిత కర్నాటి 9 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.50ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. లలితాబాగ్ కాళికానగర్‌కు చెందిన మీర్ సజ్జాద్ అలీ (19) 2022 మే 27న డబీర్‌పురా నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ ఇంటి తాళాలను పగలగొట్టి ఇంట్లోని గోల్డ్ రింగ్, రూ.5 వేల నగదు, విదేశీ కరెన్సీని చోరీ చేశాడు. దీనిపై అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మీర్ సజ్జాద్ అలీని అరెస్ట్ చేశారు. నిందితుడు సజ్జాద్ అలీని నాంపల్లిలోని 8వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా నిందితుడికి న్యాయమూర్తి కవిత కర్నాటి 9 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.50ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బీసీల ఆర్థిక ప్రగతికి చేయూత

లిబర్టీ: బీసీల ఆర్థిక ప్రగతి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకుందని అన్నారు. బీసీ దళ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల ఆర్థిక ప్రగతి, సంక్షేమానికి చేయూతనివ్వటానికి బడ్జెట్ 6,229 కోట్లు కేటాయించడం చారిత్రాత్మకమన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో బీసీలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సమాజంలో సమున్నత స్థానం కల్పించేందుకు ముఖ్యమంత్రి సారథ్యంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు.